క్లుప్తంగా

ఏపీఎంగా రమణమూర్తి

పొందూరు: స్థానిక మండల ఐకేపీ ఏపీఎంగా రుప్ప రమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎచ్చెర్ల ఏపీఎంగా పని చేస్తున్న ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం పొందూరు ఏపీఎం (ఇన్‌చార్జి)గా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.శ్యామలరావు ఆమదాలవలస సీసీగా బదిలీ అయ్యారు.

విచారణ

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ఉపవిద్యాశాఖాధికారి విజయకుమారి విచారణ చేపట్టారు. పాఠశాలపై వచ్చిన ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ విచారణ చేపట్టారు. పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో నిర్మించిన క్రీడా మైదానంలో జరిగిన అవకతవకలపై, గతంలో పాఠశాలలో విద్యార్థుల మధ్య కొట్లాపై విచారణ జరిపారు. పాఠశాలలో పెడుతున్న మధ్యాహ్న భోజనంపై కొంతమంది విద్యార్థులు డిప్యూటీ ఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత రెండు రోజులుగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు పూర్తయ్యాయి. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా జిల్లా స్థాయికి ఎంపికలు నిర్వహించారు. మంగళవారం బాలుర విభాగంలో 122 మందిని ఎంపిక చేయగా.. బుధవారం బాలికల విభాగంలో 120 మందిని ఎంపిక చేశారు. మొత్తం 310 మంది బాలికలు ఆటల పోటీలకు హాజరయ్యారు. స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి కన్వీనర్ ఆనంద్‌తోపాటు పలువురు పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న వైద్యురాలు

హిరమండలం: ఫిజియోథెరపీ సేవలను ప్రత్యేకావసరాల గల చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని భవిత కేంద్రం వైద్యాధికారి గ్రేస్ శాంతి అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేకావసరాల గల చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి వచ్చిన 14 మంది ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలందించారు. ఫిజియోథెరపిస్టు మాట్లాడుతూ క్రమంతప్పకుండా ఇంటి వద్ద సాధన చేయాలని సూచించారు. ఐఈఆర్టీసీలు సీతన్నాయుడు, గోవిందరావు ఉన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

నరసన్నపేట: దేశ రక్షకులకు అందించే ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారామిలటరీ సైనికులకు కూడా అమలు చేయాలని పారామిలటరీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సంఘం ప్రతినిధులు కె.రామారావు, గంగిట్ల శ్రీనుయాళ్ల అప్పలనాయుడు, వి.అప్పలరామన్న బుధవారం మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గడిచిన రెండు రోజులుగా మంత్రి అచ్చెన్నాయుడుతోపాటు జిల్లాలోని అందరి ఎమ్మెల్యేలకు కలిసి వినతి పత్రాలు ఇచ్చామన్నారు. అందరూ సానుకూలంగా స్పందించారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారామిలటరీ సైనుకులకు అందడం లేదన్నారు. ప్రతీ జిల్లాలో పారామిలటరీ సైనికులకు క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బుధవారం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి వినతి పత్రమిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రామారావు, వంగ హరినాథ్, గుండ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా అరుణ



హిరమండలం: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సబ్ రిజిస్ట్రార్‌గా బి.అరుణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కుమార్ ఇప్పటివరకు ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆమదాలవలస నుంచి అరుణ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఉపాధ్యాయినికి అస్వస్థత

సారవకోట: మండలంలోని పద్మాపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయిని ఈశ్వరి బుధవారం స్పృహతప్పి పడిపోయారు. ఆమె కొంతసమయం వరకు స్పృహలోకి రాకపోవడంతో హెచ్‌ఎం గౌరమ్మ సూచన మేరకు స్థానిక ఆశ కార్యకర్త, ఎంఎల్‌హెచ్‌పీ కలిసి సారవకోట పీహెచ్‌సీకి తరలించారు. ఇక్కడ వైద్యులు సమ్మెలో ఉండటంతో సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నరసన్నపేటకు తరలించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

● తెరుచుకోని హౌసింగ్ కార్యాలయం!



సారవకోట మండల పరిషత్ ఆవరణలో ఉన్న హౌసింగ్ కార్యాలయం బుధవారం తెరుచుకోలేదు. కార్యాలయ పనుల నిమిత్తం వచ్చిన వారు వెనుదిరిగారు. కార్యాలయం ఏఈ ఇక్కడ నుంచి బదిలీపై జలుమూరు వెళ్లడంతో ఆయన స్థానంలో ఏఈని నియమించలేదు. కార్యాలయ సిబ్బంది సైతం హాజరుకాకపోవడంతో కార్యాలయ తలుపులు తెరుచుకోలేదు. దీనిపై ఇన్‌చార్జి ఏఈ ప్రసాదరావును వివరణ కోరగా.. కంప్యూటర్ ఆపరేటర్ సెలవు పెట్టారని, వర్క్‌ఇన్‌స్పెక్టర్ పనుల నిమిత్తం ఏరియా మీదకు వెళ్లినట్లు తెలిపారు.
– సారవకోట

● ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శాంతిహేమ్ మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థులు ఏది మంచి, ఏది చెడు అనేది తెలుసుకోగలరన్నారు. మంచి మార్గం వైపు పయనించి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. అధ్యాపకులు రవికుమార్, పి.అన్నాజీరావు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు.
– నరసన్నపేట

● వితరణ



నరసన్నపేట వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రికి మార్పు విజయ్‌కుమార్ నాలుగు సిమెంట్ బెంచీలు వితరణ చేశారు. రోగులు, వారి బంధువులు సేద తీరడానికి వీలుగా బెంచీలు వితరణ చేయాలని ఆస్పత్రి సిబ్బంది కోరగా ఈశ్వరమ్మ, ఈశ్వరరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వీటిని సమకూర్చినట్లు విజయ్‌కుమార్ తెలిపారు. విజయ్‌కుమార్‌ను ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనుబాబు, ఏఓ రమణమూర్తి అభినందించారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు.
– నరసన్నపేట

అవస్థలు

- వర్షం పడితే కాలవను తలపిస్తున్న రైల్వే అండర్ పాసేజ్‌లు
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం
- పట్టించుకోని రైల్వే అధికారులు



నడగాం అండర్ పాసేజ్ వద్ద నీటిలో నిలిచిపోయిన ఆర్టీసి బస్సు (ఫైల్)

నరసన్నపేట: రైల్వే క్రాసింగ్‌ల వద్ద గేట్లు ఉండటం వల్ల వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటికప్పుడు గేట్లు వేయడం వల్ల గంటల తరబడి వాహనాలు స్థంబిస్తున్నాయి. క్రాసింగ్‌ల వద్ద అండర్ పాసేజ్‌లు నిర్మిస్తే వాహనదారుల కష్టాలు తీరుతాయని రైల్వే శాఖ నిర్మించింది కోట్ల రూపాయలు వెచ్చించి. గేట్లు సమస్య పరిష్కారం అయినా వర్షం పడితే మాత్రం కొత్త రకం కష్టాలు వాహనదారులకు కలుగుతున్నాయి. రైల్వే అండర్ పాసేజ్‌ల వద్ద నిర్వహణ సక్రమంగా లేకపోవడం, నిర్మాణంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వాహనదారులకు కష్టాలు మొదలయ్యాయి. ప్రధానంగా అండర్ పాసేజ్‌లు భూ ఉపరితలం కంటే కిందకు వేయడంతో వర్షం నీరు అండర్ పాసేజ్‌ల్లో చేరుతుంది. రోజుల తరబడి వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతుంది. ఇవేమి కష్టాలు అని వాహనదారులు, స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. వర్షం పడిన ప్రతిసారీ ఇవే అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

మూడు చోట్లా ఒకటే పరిస్థితి..

నరసన్నపేట మండలంలోని నడగాం, చిక్కాలవలస, కానుకుర్తువానిపేట వద్ద అండర్ పాసేజ్‌లు నిర్మించారు. మూడు చోట్ల ఒకటే పరిస్థితి. ఆర్‌అండ్‌బీ రహదారికి ఆనుకొని నడగాం వద్ద అండర్ పాసేజ్‌లో నీరు అధికంగా చేరుతుంది. ఇటీవల వర్షాలకు ఆర్టీసీ బస్సు నీటిలో ఉండిపోయింది. చిక్కాలవలస వద్ద కూడా ఇదే పరిస్థితి. ఆర్‌అండ్‌బీ రోడ్లు కావడంతో వాహనాలు అధికంగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రెండు చోట్ల నీరు నిల్వ లేకుండా వర్షం నీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలి. రైల్వే సివిల్ ఇంజినీర్లు మొక్కుబడి చర్యలు కాకుండా శాశ్వత పద్ధతిలో నీరు వెళ్లిపోయేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చిక్కాలవలస రైల్వే అండర్ పాసేజ్ వద్ద నిలిచిన నీరు

కష్టాలు పెరిగాయి..



నడగాం అండర్ పాసేజ్ వద్ద కష్టాలు పెరిగాయి. వర్షం పడితే నరకం చూస్తున్నాం. చిన్న, చినుకులు పడినా నీరు చేరుతోంది. రోజులు తరబడి ఇబ్బందులు తప్పడం లేదు. నడుం లోతు వరకు నీరు ఉండటంతో వాహనాలతో రాకపోకలు చేయలేకపోతున్నాం. గేట్ ఉంటేనే కొంత మేలుగా ఉండేది. అండర్ పాసేజ్ వేసిన తరువాత కష్టాలు రెట్టింపు అయ్యాయి. రైల్వే అధికారాలు తగిన చర్యలు తీసుకోవాలి.

– ఉకలాపు రవి, నడగాం, నరసన్నపేట మండలం

వర్షం పడితే ట్రాఫిక్ జామ్..



వర్షం పడిందంటే చిక్కాలవలస గేటు వద్ద వాహనాలు స్థంబిస్తున్నాయి. ఎటు వాహనాలు అటే ఉండిపోతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులతోపాటు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. 40 గ్రామాలకు ఇది ప్రధాన రహదారి.

– సడగాన రవి, సుందరాపురం, నరసన్నపేట మండలం

లడ్డూ పేరుతో రాజకీయం తగదు

- నిజాలను దాచిపెడుతున్న సీఎం చంద్రబాబు
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: తిరుపతి లడ్డూ పేరుతో సీఎం చంద్రబాబు రాజకీయ చేయడం తగదని, మహా ప్రసాదం తయారీలో కూటమి ప్రభుత్వం నిజాలను దాచిపెడుతుందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 2014–19 మధ్య కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తిరుపతి దేవస్థానానికి వచ్చిన నెయ్యి, ఇతర సరకులు 15 సార్లు తిప్పి పంపించారని అప్పటి రికార్డులు పరిశీలిస్తే తెలుస్తోందన్నారు. తిరుపతి ప్రసాదంలో వినియోగించే నెయ్యిని ఎన్ఏబీఎల్ మూడు దశల్లో సర్టిఫై చేసిన తరువాత తీసుకురావల్సి ఉంటుందన్నారు. ఇంత ఉత్తమ, పతిష్టమైన విధానం కొన్నేళ్లుగా టీటీడీ పాటిస్తున్న విషయం వాస్తవం కాదా అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ నెయ్యి వాడరని తప్పుడు ప్రచారం చేయడం అన్యాయమన్నారు. 2024 జూలైలో నెయ్యి పరీక్షలు చేశారని ఆదే నెల 23వ తేదీన పరీక్షల రిపోర్టు వచ్చిందన్నారు. అంటే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడునే కల్తీ నెయ్యి తెచ్చారని వివరించారు. 2015–18 మధ్య కాలంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు నందిని బ్యాండ్ నెయ్యికి కాంట్రాక్టు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రపంచంలో ఉన్న కోట్ల మంది స్వామి వారి భక్తులను తీవ్ర ఆందోళనలోకి నెట్టే పని ఎందుకు చేస్తున్నారని చంద్రబాబుని నిలదీశారు. నిజాలు ఏమిటో ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. వంద రోజుల పాలనలో ప్రజలకు ఏమీ చేయలేకపోయామని చెప్పుకోలేకే చంద్రబాబు కల్తీ నెయ్యి అంటూ వైఎస్సార్‌సీపీన, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పైన తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు.

తమ్మినేనికి అభినందనలు



తమ్మినేని సీతారాంను అభినందిస్తున్న నాయకులు

ఆమదాలవలస: శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను సరుబుజ్జిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం ఆమదాలవలసలో ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. తమ్మినేనికి సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె.వి.జి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ శివానందబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొవిలాపు చంద్రశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకుముకి పరీక్షలకు విశేష స్పందన



హిరమండలం: అవలంగి పాఠశాలలో చెకుముకి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

హిరమండలం: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికతీయడానికి చెకుముకి పరీక్షలు ఉపయోగపడతాయని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.గొల్లవాడు అన్నారు. బుధవారం పాఠశాలలో చెకుముకి పరీక్షలు నిర్వహించినట్లు హెచ్‌ఎం తెలిపారు ఈ పోటీ పరీక్షల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

జలుమూరు: విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని లింగావలస జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉంగటి అప్పల సూర్యానారాయణ అన్నారు. బుధవారం విద్యార్థులకు చెకుముకి ప్రతిభ పరీక్షలు నిర్వహించి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ బమ్మిడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జల్లు రమణ మూర్తి, గార విశ్వనాథం, డి.కాత్యాయని, కె.చిట్టెమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం చెకుముకి పోటీలను నిర్వహించినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి జనార్దనరావు అన్నారు. వివిధ పాఠశాలల నుంచి 8, 9, 10 తరగతులకు చెందిన 50 మంది విద్యార్థులు హాజరయ్యారని హెచ్‌ఎం అప్పల రాములు తెలిపారు. జె.వి.వి ప్రాంతీయ కమిటీ కోశాధికారి కూర్మాన షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకున్న ప్రముఖులు



అస్సాం ప్రిన్సిపాల్ సెక్రటరీ దంపతలకు ఆలయ కథను వివరిస్తున్న అర్చకుడు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని అస్సాం ప్రిన్సిపాల్ సెక్రటరీ శంతను గొట్మారే, రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ సహాసని గొట్మారే దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఆలయ చరిత్ర, గర్భగుడిలో ఉన్న గోలెం వృత్తాంతం, శిల్పకళా సంపదను అర్చకులు వివరించారు. ఆలయ శిఖర దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలు అందించారు. రాజమహేంద్రవరం దేవాదయ ధర్మాదాయశాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఎంపీడీఓగా నర్సింహప్రసాద్ పండా



మెళియాపుట్టి: స్థానిక ఎంపీడీఓగా నర్సింహ ప్రసాద్ పండా బుధవారం బాధ్యతలు చేపట్టారు. పాతపట్నం మండల విస్తరణ అధికారిగా పనిచేసిన ఈయన ప్రమోషన్‌పై పశ్చగోదావరి జిల్లాలోని ఆచంట మండలంలో కొంతకాలం ఎంపీడీఓగా విధులు నిర్వర్తించారు. గతంలో మెళియాపుట్టి మండలంలో ఈఓపీఆర్డీగా సుదీర్ఘకాలంపాటు పనిచేసిన అనుభవం ఉంది. ఆయనకు పలు శాఖల సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు.

రైతుల ఆందోళన



నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళన చేస్తున్న రైతులు

కొత్తూరు: మండలంలోని కల్లెమ్మ గ్రామంలో భూముల రీ సర్వేలో జరిగిన అక్రమాలపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. రీ సర్వేలో అన్ని హక్కులు ఉన్న రైతుల పేర్లకు బదులు ఏ హక్కులు లేని కొంతమంది వ్యక్తుల పేర్లును నమోదు చేశారన్నారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. ఇక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ప్రసాదరావుతోపాటు రైతులు మాట్లాడుతూ.. రీ సర్వేలో తప్పులు నమోదు చేయడంతో అర్హులైన రైతులకు అన్యాయం జరిగిందన్నారు. అడంగల్, 1బీ పత్రాలు రాకపోవడంతో వ్యవసాయ రుణాలు పొందలేకపోతున్నామన్నారు. పంట నమోదుకు అవకాశం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. రీ సర్వేలో తప్పులు నమోదు చేసిన అధికారులు, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పాపారావుకు వినతిపత్రం అందించారు. రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేయాలంటే రైతులు సహకరించాలని తహసీల్దార్ కోరారు. రైతులు తమ భూ హక్కు పత్రాలు సమర్పిస్తే జేసీకి నివేదించి న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

జగనన్న కాలనీ లేఅవుట్లు పరిశీలించాలి

పాతపట్నం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జగనన్న కాలనీ లేఅవుట్ల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.కరుణాకరరావు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల అధికారులు, సచివాలయం అసిస్టెంట్ ఇంజినీర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇళ్లు ఏ దశలో ఉన్నయో పరిశీలించి, నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 28లోగా ఇళ్ల పరిస్థితి తెలియజేయాలన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లు 2025 మార్చి ఆఖరులోగా పూర్తిచేయాలని, లేకపోతే బిల్లులు ఇవ్వలేమన్నారు. హౌసింగ్ ఏఈ సీతారామరాజు, మండల ఇంజినీర్ ప్రసాదరావు, ఏపీఓ సురేష్, ఏపీఎం మనోరత్నం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యూత్ క్లబ్ సేవలు ప్రశంసనీయం



సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న రవిమణి

పొందూరు: జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో బెజ్జిపురం యూత్ క్లబ్ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని ఇండియా లిటరసీ ప్రాజెక్టు నాలెడ్జ్ హబ్ మేనేజర్ రవిమణి అన్నారు. తాడివలస ఉన్నత పాఠశాలలో బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత–బాలవికాసం ప్రాజెక్టులో భాగంగా అమలవుతున్న సేవా కార్యక్రమాలను పరిశీలించారు. సైన్స్ ప్రాజెక్టులు, కేరీర్ గైడెన్స్, గ్రంథాలయ పుస్తకాల పఠనం, జీవన నైపుణ్యాలు, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు తదితర అంశాలపై ఆయన పరిశీలించి బెజ్జిపురం యూత్ క్లబ్‌ను ప్రశంసించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాలశెట్టి సాయికుమార్, ఉపాధ్యాయులు పూజారి హరిప్రసన్న, రావాడ పాపారావు, అనంత భట్లు, బెజ్జిపురం యూత్ క్లబ్ కో ఆర్డినేటర్లు హేమసుందర్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నాలుగు రోజులుగా అంధకారం



చీకటిగా ఉన్న బైరాగివీధి

నరసన్నపేట: స్థానిక స్టేట్‌బ్యాంక్, బైరాగి, బాలికోన్నత పాఠశాల వీధుల్లో లైట్లు వెలగకపోవడంతో స్థానికులు రాత్రి పూట ఇబ్బంది పడుతున్నారు. గత నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా అటు విద్యుత్ శాఖ అధికారులు, ఇటు పంచాయతీ అధికారులు ఒకరిపై మరొకరు వాదులాడుకుని పట్టించుకోవడం లేదని ఆయా వీధి వాసులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం అనధికారికంగా చెట్ల కొమ్మలు కట్ చేసేందుకు విద్యుత్ సిబ్బంది వచ్చారన్నారు. చెట్ల కొమ్మలు వైర్లుపై పడటంతో ట్రాన్స్‌ఫార్మర్ పాడైందన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

ఆమదాలవలస: మండలంలోని తోటాడ, అక్కివరం గ్రామ పంచాయతీల్లో బుధవారం సాయంత్రం కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో భాగంగా నిర్వహిస్తున్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. తాగునీరు, పింఛన్లు, మురుగు కాలువలు, రేషన్ కార్డులు, వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి ఆయా గ్రామస్తులు తీసుకువచ్చారు. గ్రామానికి చెందిన తమ్మినేని సురేష్ రోజువారి కూలి పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి కిందకు పడిపోవడంతో చేతులు నడుముకు తీవ్రగాయాలు కావడంతో పనికి వెళ్లలేక కుటుంబ పోషణ కష్టంగా మారిందని రవికుమార్ వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సర్వే నంబర్ 121 లో 200 ఎకరాల భూ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు.

ఇసుక లారీ సీజ్

ఆమదాలవలస: మండలంలోని దూసిపేట జంక్షన్ వద్ద బుధవారం ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. దూసిపేట గ్రామ సమీపంలో గల నాగావళి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి లారీతో రవాణా చేస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు తెల్లవారుజామున దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామానికి చెందిన లారీ ఇసుక లోడుతో రాగా పరిశీలించామన్నారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు పశువైద్య శిబిరం

పాతపట్నం: ఈ నెల 26వ తేదీన మండలంలోని ఆర్.ఎల్.పురంలో పశువైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు పశుసంవర్ధకశాఖ వైద్యురాలు బి.శ్రీవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. పాడి రైతులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యం

జలుమూరు: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే మండలాన్ని అభివృద్ధి సాధ్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వం పెద్ద నిధులు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. వ్యవసాయశాఖతో ప్రారంభించి అన్ని శాఖల పనితీరును ఆయా అధికారులు వివరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

హిరమండలం: సుభలయ ఆర్‌అండ్ఆర్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడం కోసం ఉన్నతధికారుల ఆదేశాల మేరకు పరిశీలన చేసినట్లు టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ బుధవారం తెలిపారు. ఈ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు డీఈఓను కోరారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించామన్నారు. ఉన్నత పాఠశాలకు అవసరమైన అవకాశాలను డీఈఓకి నివేదకను అందించనున్నట్లు తెలిపారు. అనంతరం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com